నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 15 జనవరి 2024 | SURYAPET

## వ్యవసాయానికి ప్రజలు ఇచ్చే గౌరవమే సంక్రాంతి

- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, జనవరి 14 : వ్యవసాయానికి, రైతులకు తెలుగు ప్రజలు ఇచ్చే గౌరవమే మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో భారత జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో ఆయన పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలు వార్డుల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో తెలుగు వాళ్లతోపాటు తమిళ, కన్నడ ప్రజలు, రైతులు జరుపుకొనే పండుగ సంక్రాంతి అన్నారు. చేతికొచ్చిన పంటలను ఆహార ధాన్యాలుగా మార్చుకునే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. చెడు ఆలోచనలు, పాత వస్తువులన్నీ భోగి మంటల్లో కలిసిపోవాలని, రైతన్నలకు శుభాలు జరుగాలని ఆకాంక్షించారు. సూర్యాపేట నియోజకవర్గ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులకు గాలిపటాలు బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నిమ్మల శ్రీనివాస్, భారత జాగృతి జిల్లా కన్వీనర్ రంగినేని ఉపేందర్, జిల్లా కో కన్వీనర్ లక్కపాక ప్రవీణ్, మహిళా విభాగం కన్వీనర్ నీల ఉమా, వికలాంగుల విభాగం అధ్యక్షుడు షేక్ నయీమ్, డాక్టర్ రామ్మూర్తి, బావుసింగ్ పాల్గొన్నారు.





# ఊరూరా సంక్రాంతి

## ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు


సూర్యాపేటలో భోగి మంటలను అంటిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి


మునగాలలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న యువతులు


నడిగూడెం రామాలయంలో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**ముంగిళ్లలో ఆకట్టుకున్న ముగ్గులు**

**అలరించిన గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు**

**పతంగుల ఎగురవేతతో చిన్నారుల సందడి**

**కనుల పండువగా గోదా రంగనాయక స్వామి కల్యాణోత్సవాలు**

**వేడుకల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు**

**నేడు సంక్రాంతి, రేపు కనుమ**

పల్లెల్లో సంక్రాంతి శోభ ఉట్టి పడుతున్నది. మూడు రోజుల ముచ్చటైన పండుగ సంబురాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు భోగి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ఇంటి ముంగిళ్లను రంగవల్లులు, గొబ్బెమ్మలతో అందంగా అలంకరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనల సంప్రదాయాలు కొనసాగాయి. బంధుమిత్రుల ముచ్చట్లు, పిండి వంటల ఘుమఘుమలు, చిన్నారుల పతంగుల ఎగురవేతతో పల్లెల్లో సందడి నెలకొన్నది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదా రంగనాయక స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. మేళ్లచెర్వులో మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో వేసిన ముగ్గు


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

## లిఫ్ట్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తాం

- అయోధ్య రామ మందిరాన్ని రాజకీయంగా వాడుకుంటున్న బీజేపీ
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెర్వు, జనవరి 14 : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గతంలో నిర్మించిన లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయించి పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటానని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు రాధాకృష్ణమూర్తి, విష్ణువర్ధన్‌శర్మ మంత్రిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఉత్తమ్‌కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమం తప్పక అమలు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాతే స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, కాంగ్రెస్ పార్టీ సుమారు 14 ఎంపీ స్థానాలను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయోధ్య రామ మందిరాన్ని బీజేపీ రాజకీయ లబ్ధికోసం వాడుకుంటుందని ఆయన విమర్శించారు. మందిర నిర్మాణం పూర్తి కాకుండానే పీఠాధిపతులు సరికాదని చెప్పినా ప్రారంభించాలనుకోవడం దారుణమన్నారు. ఆయన వెంట నాయకులు భాస్కర్‌రెడ్డి, సైదేశ్వర్‌రావు, గోవిందరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, వీరారెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి ఉన్నారు.

## యాదగిరిగుట్ట భక్తులకు 'శ్రీలహరి' గ్రంథం

యాదగిరిగుట్ట, జనవరి 14 : ప్రాణ చైతన్యానికి ఇచ్చే పరమ పవిత్ర శ్రీవైష్ణవ స్తోత్రాలతో తేజరిల్లుతున్న శ్రీమంతమైన మంత్ర పేటిక 'శ్రీలహరి' గ్రంథాన్ని ఇకపై యాదగిరిగుట్ట క్షేత్రంలో ప్రతి శనివారం బ్రేక్ దర్శనంలో పాల్గొనే భక్తులకు ఉచితంగా అందిస్తామని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ప్రముఖ రచయిత, శ్రీశైలం దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారు పురాణపండ శ్రీనివాస్ రచించి, సంకలనం చేసిన 'శ్రీలహరి' ప్రత్యేక గ్రంథాన్ని ఆదివారం భోగి సందర్భంగా ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ ఆసుపత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య సమర్పణలో ప్రచురించబడిన ఈ ప్రత్యేక గ్రంథం తొలి ప్రతిని ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న పురణాపండ శ్రీనివాస్‌కు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ మినర్వా హోటల్ గ్రూప్‌నకు చెందిన రవి, శ్రీనివాస్, అనిత పాల్గొన్నారు.







## సంక్షేమ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తాం

- విలేకరుల సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

నీలగిరి, జనవరి 14 : ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో సుమారు 30లక్షల మంది ఆడబిడ్డలు ఉచితంగా సొంత గ్రామాలకు వెళ్లారన్నారు. రాష్ట్ర ప్రజలు, రైతులు పాడి పంటలతో, సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీతోపాటు ఇందిరమ్మ ఇండ్లు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను గ్రామ సభల్లోనే ఎంపిక చేస్తామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి 12 నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో రూ.10 కోట్లతో హాస్టల్ నిర్మాణం, నల్లగొండ నుంచి ముషంపల్లి, కన్నెకల్ మీదుగా తిప్పర్తి వెళ్లేలా రూ.100 కోట్లతో, గుండ్లపల్లి నుంచి రేగట్టె వరకు రూ.30 కోట్లతో డబుల్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. దర్వేశిపురం వయా దోరెపల్లి, పగిడిమర్రి వరకు రూ.34 కోట్లతో రోడ్డు పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ పాయింట్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై ఎంక్వయిరీ వేశామని, సమగ్ర నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా కేంద్రంలో మిగిలిపోయిన డ్రైనేజీ, రోడ్లతోపాటు మున్సిపాలిటీలో విలీనం చేసిన చర్లపల్లి, మర్రిగూడెం, ఆర్జాల బావిలో మిగిలిన పనులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో నల్లగొండ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేశ్, నల్లగొండ ఎంపీపీ మనిమద్దె సుమన్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్ కేసారి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.





## పతంగులు ఎగురవేస్తున్నారా.. జాగ్రత్త

**ఎత్తైన గోడలు, మిద్దెలు ఎక్కకపోవడమే ఉత్తమం**

**జాగ్రత్తలు తీసుకుంటే ఆనందం మీ వెంటే..**

నేరేడుచర్ల, జనవరి 14 : సంక్రాంతి పండుగ అంటే గంగిరెద్దులు, రంగవల్లులు, గొబ్బెమ్మలు ఎంత ప్రధానమో గాలి పటాలు కూడా అంతే. ఈ పండుగ సమయాల్లో గాలి పటాలు ఎగురవేస్తూ ఆనందించడం రివాజు. పట్టణ ప్రాంతాల్లో గాలి పటాలు ఎగురవేసే సంస్కృతి కొద్దిమేర తగ్గినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అధికంగా ఉన్నది. గాలి పటం ఎగురవేసే సమయంలో ధ్యాసంతా దానిపైనే ఉంటుంది. ఈ సమయంలో గోడలు, మిద్దెలు, ఎత్తైన భవనాలు, మైదానాల నుంచి ఎగురవేస్తూ ప్రమాదాలకు గురవడం చూస్తూనే ఉంటాం. విద్యుత్ తీగలకు చుట్టుకున్న గాలి పటాలను తొలగించే ప్రయత్నంలోనూ విద్యుదాఘాతానికి గురైన సంఘటనలూ చోటు చేసుకునే ప్రమాదం ఉన్నది.



### మాంజా పట్ల అప్రమత్తం

గాలి పటాలు ఎగురవేయడంలో ఆనందం ఉంటుంది. దీంతోపాటు అజాగ్రత్తగా ఉంటే ఎనలేని దుఃఖం దరిచేరుతుంది. గాలి పటాలు ఎగురవేసే సమయంలో వేళ్లకు ప్లాస్టర్ వంటివి చుట్టుకోవాలి. దీని వల్ల మాంజా పూసిన దారం వల్ల చేతివేళ్లు తెగకుండా ఉంటాయి. ఏదైనా ప్రమాదం జరిగి రక్తస్రావం అయితే గాయాన్ని శుభ్రంగా కడగాలి. రక్తస్రావం ఆగేందుకు బ్యాండేజీతో కట్టేసి సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ముఖ్యంగా గాలి పటాలను ఇతరులకు ఇబ్బంది లేకుండా మైదాన ప్రాంతాల్లో ఎగురవేయడమే మేలు.

### మిద్దెలు ఎక్కకపోవడమే ఉత్తమం

గాలి పటాలు బాగా ఎత్తున ఎగురవేయాలని చాలా మంది సమీపంలోని మిద్దెలు, ఎత్తైన గోడలపైకి ఎక్కుతారు. ఇలా ఎక్కి గాలి పటాలను వదిలే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడే అవకాశం ఉంది. ఒకవేళ కిందపడి దెబ్బలు తగిలితే అక్కడ మసాజ్ చేయకూడదు. రక్తస్రావం ఉన్నచోట బ్యాండేజీని వదులుగా చుట్టాలి. గాయాలైన చోట పసుపు కూడా అద్దకూడదు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాలి.

### విద్యుత్ తీగలున్న చోట జాగ్రత్తగా ఉండాలి

సంక్రాంతి పండుగకు గాలి పటాలు ఎగురవేయడం సర్వసాధారణం. అయితే.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. ప్రధానంగా విద్యుత్ లైన్లు తగిలిన దానిని కర్రలు, గడలతో లాగేందుకు ప్రయత్నం చేయరాదు. దీనివల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది. ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లయితే సమీపంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో తెలుపాలి.







